బాబూ.. భరోసా ఏదీ?

చెప్పిందే కాకుండా చెప్పందీ చేసేవాడే నిజమైన నాయకుడు. తన ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇదే శైలిలో పాలన సాగించారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు పరిచి పేదలకు ఎన్నో మేళ్లు చేశారు. పేదవాడు హాయిగా బతకాలంటే ఏం చేయాలో అహర్నిశలు ఆలోచన చేసి అమలు చేసేవారు. తినేవాడికి అదృష్టం లేకపోతే చేతిలో ముద్ద కాకెత్తుకుపోతుందనే సామెతలా తయారయింది పేదల పరిస్థితి ఇప్పుడు. తమ బాగోగులు చూసుకుని వేళకు అన్నీ అమర్చే ప్రభుత్వం లేక వారు అష్టకష్టాలు పడుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకార భరోసా అందించక గంగపుత్రులు ఇప్పుడు ఎన్నో బాధలకు గురవుతున్నారు. పెరిగిన ధరలతో బతుకు బండి లాగటం కష్టంగా ఉందని.. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చినట్లే మత్స్యకార భరోసా అందించాలని కోరుతున్నారు.



ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల పడవలు

- మత్స్యకార భరోసా అందక గంగపుత్రుల విలవిల
- గత ప్రభుత్వం ఇచ్చినట్లే ఇవ్వాలని డిమాండ్

దాబాగార్డెన్స్: గంగమ్మ ఒడిలోనే జీవితాలు గడిపే మత్స్యకారులు ప్రమాదాలకు ఎదురేగి జీవితాలు గడుపుతారు. వేట సాగితేనే వారి బతుకు బండి కదులుతుంది. సముద్రంలో వారు వేటకు వెళ్లక పోతే వారి కుటుంబాలు పస్తుండాల్సిందే. ఇంతగా కడలిపై ఆధారపడి కడుపు నింపుకుంటున్న మత్స్యకారులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. వేట విరామ సమయంలో జగన్ సర్కారు మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు అందించి ఆసరాగా నిలిచింది. కానీ చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక మత్స్యకారులకు ఎలాంటి సహకారం లేకపోవడంతో వారు విలవిల్లాడుతున్నారు. వేట ప్రారంభమై నెల గడుస్తున్నా.. విరామ సమయంలో చేసిన అప్పులు తీరక గంగపుత్రులు మత్స్యకార భరోసా అందక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక నిట్టూరుస్తున్నారు.

దక్షిణలో మత్స్యకారుల ఉనికి ఇలా..

దక్షిణ నియోజకవర్గంలో దాదాపు 30 వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు సముద్రంలో వేట చేయటమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్నాయి. జాలరిపేట, మత్స్యకార పల్లె, పెయిందొరపేట, రెల్లివీధి, జబ్బరతోట, ఫిషింగ్ హార్బర్ రోడ్డు, కొత్త అగ్రహారం, కదిరి దానప్పవీధి, థామ్సన్ స్ట్రీట్, కన్వేయర్ బెల్ట్, కోటవీధి తదితర ప్రాంతాల్లో 8 వేలకు పైబడి మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయి. తీర ప్రాంతాన్ని ఆనుకుని వీరంతా జీవిస్తున్నారు. కుటుంబంలోని మగవారంతా వేటకు వెళ్లి చేపలు పడుతుంటారు. మహిళలు వాటిని నగరంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ఇలా నిత్యం వేటను నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారులకు కుటుంబ పోషణతో పాటు పిల్లలను చదివించుకోవడం భారమవుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు నెలల పాటు చేపల వేటకు విరామం ప్రకటిస్తోంది. ఈ సమయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరిట సాయమందించి ఆదుకుంది. మత్స్యకారులకు ప్రస్తుతం ఎటువంటి సాయం అందక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఫిషింగ్ హార్బర్ జెట్టీలో వలలో చిక్కుకున్న చేపల్ని సేకరిస్తున్న మత్స్యకారులు

రూ.10 వేలు ఇచ్చి ఆదుకున్న జగన్ సర్కార్..

మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా గత ఐదేళ్ల పాటు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేసింది. ఏటా వేట విరామ సమయంలో అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసింది. విరామ సమయంలో కుటుంబ పోషణతో పాటు బోట్లు, పడవలను వేటకు సిద్ధం చేసుకునేందుకు ఈ ఆర్థిక తోడ్పాటు మత్స్యకారులకు ఎంతో మేలు చేసింది. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకార భరోసాను కొండెక్కించింది. దీంతో వేట ప్రారంభమై నెల గడచినా సాయం అందక మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

సాయం చేసి ఆదుకోవాలి



సముద్రంలో వేట ద్వారా జీవనం సాగించే మత్స్యకారులంతా మత్స్యకార భరోసాకు అర్హులే. అయితే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంగ పుత్రులకు ఇచ్చే మత్స్యకార భరోసా గురించి ఆలోచించిన దాఖలాలు కనిపించటంలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు ఇచ్చిన మత్స్యకార భరోసా నిలిపి వేయడమే ఇందుకు నిదర్శనం. వేట విరామం ముగిసిన తర్వాత ఏటా జూన్‌లోనే మత్స్యకారులకు రూ.10 వేలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించేది. అయితే ఇటీవల అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకార భరోసా అందించక గంగపుత్రులు సాయం కోసం నిరీక్షిస్తున్నారు. – బర్రి కొండబాబు, మత్స్యకారుడు

ఆర్థిక భరోసా కొనసాగించాలి..



రాష్ట్రంలోని మత్స్యకారులకు మత్స్యకార భరోసా పేరిట వైఎస్సార్‌సీపీ ఇచ్చిన ఆర్థిక భరోసాను చంద్రబాబు ప్రభుత్వం కూడా కొనసాగించాలి. ఈ ఆర్థిక భరోసాతో మత్స్యకారులంతా ఎంతో లబ్ధి పొందేవారు. వేట విరామ సమయంలో కుటుంబ పోషణతో పాటు వేట సామగ్రి, వలలు, బోట్లు సిద్ధం చేసుకోవడానికి, చేసిన అప్పులు తీర్చుకోవటానికి భరోసా నిధులు ఎంతో ఉపయోగపడేవి. ప్రస్తుత ప్రభుత్వం తక్షణం మత్స్యకార భరోసా మంజూరు చేయాలి.

–యాగ శ్రీనివాసరావు,
బోటు యజమాని, జాలరిపేట

క్లుప్తంగా

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



చందన అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: ఆషాడ శుద్ధ ఏకాదశి, తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తుల తాకిడి పెరిగింది. తెల్లవారు జాము నుంచే స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామిని చందనంతో విశేషంగా అలంకరించి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం దేవ స్థానం ఆవరణలో గల ధ్వజస్తంభం వద్ద మహిళలు ప్రత్యేకంగా దీపాలంకరణ చేసి పూజలు చేశారు. వేడుకల్లో మహిళల కోలాటం ఆకట్టుకుంది.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి పూజలు జరిపారు. ప్రతి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి పసుపు నీళ్లతో జలాభిషేకం ఆనవాయితీ అని అర్చకుడు శ్రీనివాస్ తెలిపారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామిని దర్శించుకున్న వాసుపల్లి



జగన్నాథస్వామి చిత్రపటాన్ని వాసుపల్లికి అందజేస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

దాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీ గుండిచా ప్రాంగణంలో దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథ స్వామిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు స్వాగతం పలికారు. పూజల అనంతరం జగన్నాథస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు సురేష్‌బాబు, పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

20న గిరిప్రదక్షిణ భక్తులకు ప్రసాద వితరణ

మహారాణిపేట: ఈ నెల 20న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు ప్రసాద వితరణ చేయాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ ఫోరం నిర్ణయించింది. 14 ఏళ్ల నుంచి ఈ ఫోరం ఆధ్వర్యంలో మురళీనగర్, అయ్యప్పనగర్ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఫోరం ప్రతినిధులు సింగూరి నర్సింగరావు, భూపతి సత్యనారాయణ, గుండు వెంటకేష్, పట్నాల నాగ వెంకట రామ్మోహన రెడ్డి తెలిపారు. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు ఇడ్లీ, టమాటా బాత్, మిరియాల పాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఆరోజు సాయంత్రం 5 గంటల నుంచి భక్తులకు ప్రసాదం అందజేస్తామని రామ్మోహన రెడ్డి చెప్పారు.

చీటీల నిర్వాహకులకు కౌన్సెలింగ్

సీపీ ఆదేశాలతో పోలీసుల చర్యలు

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు అన్ని స్టేషన్లలో చీటీల నిర్వాహకులను పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ చేస్తున్నారు. గతంలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కొందరు చీటీల నిర్వాహకులు బోర్డు తిప్పేయడంతో బాధితులు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తెలిసిందే. రోజువారీ కూలీలు, ఇతర వృత్తిదారులు తమ పిల్లల చదువులు, వివాహాలు వంటి అవసరాల నిమిత్తం చీటీలు వేస్తుంటారు. దసరా, సంక్రాంతి, వరలక్ష్మీ వ్రతం వంటి నగదు చీటీలు కడుతుంటారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ప్రజలు విశాఖకు వలస వచ్చి చిన్న చిన్న పనులు, వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని చీటీల రూపంలో పొదుపు చేసుకుంటున్నారు. వీరి బలహీనతను ఆసరాగా తీసుకుని కొందరు చీటీ నిర్వాహకులు అర్ధాంతరంగా బిచాణా ఎత్తేయడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్య..

ప్రభుత్వ లైసెన్స్ లేని చీటీ నిర్వాహకులంతా చీటీలు వేయకుండా ముందు జాగ్రత్త చర్యగా అన్ని స్టేషన్లకు పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని సమాచారం. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా అటు ద్వారకా జోన్.. ఇటు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లలో చీటీల నిర్వాహకుల తాకిడి కనిపిస్తోంది. పోలీసులు వీరికి రోజూ కౌన్సెలింగ్ చేస్తున్నారు. ప్రతి నెలా ఎక్కడో ఒక చోట చీటీల నిర్వాహకులు బోర్డు తిప్పేయడం ఆనవాయితీగా మారిపోయింది. పలు ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ లైసెన్స్ తీసుకున్న తరువాతే చీటీలు నిర్వహిస్తుంటారు. కానీ నివాసాల మధ్య కొందరు చీటీల నిర్వాహకులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే దర్జాగా చీటీపాటలు వేస్తూ.. అమాయక ప్రజలను మోసం చేయడం పరిపాటిగా మారింది.



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్

మోసపోవద్దు.. మేల్కోండి

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో చీటీల నిర్వాహకులు ఎక్కువగా ఉన్నారని సమాచారం. ఎవరైనా చీటీల నిర్వాహకులు పాటదారులకు వెంటనే సొమ్ములు చెల్లించాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీసులు నిర్వాహకులను హెచ్చరిస్తున్నారు. నగర సీపీ ముందు జాగ్రత్త చర్యగా చీటీల నిర్వాహకులను మొదట్లోనే కట్టడి చేస్తే మోసాలకు ఆస్కారం లేకుండా చేయొచ్చని యోచిస్తున్నారు. ప్రభుత్వ లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద చీటీలు వేసి మోసపోవద్దని ప్రజలకు పోలీసులు సూచిస్తున్నారు. చీటీలు వేసి మోసపోయిన తరువాత తమను ఆశ్రయించడం కన్నా.. ముందే మేల్కోవాలని పోలీసులు హితవు పలుకుతున్నారు.

గిరిప్రదక్షిణలో ఉచిత వైద్య సేవలు

సీతంపేట: ఈ నెల 20న జరగనున్న సింహాచల గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహణకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నట్టు రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్షుడు ఎం.డి.యాసిన్ తెలిపారు. శంకరమఠం రోడ్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీ హెల్త్‌కేర్, ఏజీకేర్ ఫౌండేషన్, ఎరుమేలు శ్రీఅయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్టు సంయుక్త నిర్వహణలో వేలాది మంది భక్తులకు ఆరోగ్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. 12 గంటల పాటు నిర్విరామంగా వైద్యసేవలు అందిస్తామని, 30 మందితో కూడిన 3 వైద్య బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం కోసం తరలించడానికి అంబులెన్స్ సర్వీస్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోర్టు స్టేడియం వెనుక రోడ్‌లో వినాయక రెసిడెన్సీ వద్ద నిర్వహించే వైద్య శిబిరంలో సేవలందించడానికి పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు స్వచ్ఛందగా ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చింతా నేతాజీ, కమ్యూనిటీ మెడికల్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.రాజు, రొటేరియన్స్ శంకర్, కె.ఎం.కె.రమేష్, వి.ప్రవీణ్, సూర్యతేజ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్షుడు యాసిన్ తదితరులు

జీవో 21ని తక్షణమే రద్దు చేయాలి

మద్దిలపాలెం: వాహన చోదకులపై జరిమానాలు విధించే జీవో నంబర్ 21ని తక్షణమే రద్దు చేయాలని ఆటో యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పడాల గోవింద్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఆటో డ్రైవర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణ పేరుతో అధిక జరిమానాలు విధిస్తూ వాహనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీవో 21ని రద్దు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ నెపంతో ట్రాఫిక్ పోలీసులు, రవాణ శాఖాధికారులు, వాహన యజమానులు, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు పీఎఫ్. ఈఎస్ఐతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు, అద్దూరి శంకర్, ఉపాధ్యాక్షుడు లంక గోవింద్, కోశాధికారి ఎన్.మధు రెడ్డి, కమిటీ సభ్యులు ఎస్.అప్పలనాయుడు, జి.శ్రీను, పి.కృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పడాల గోవింద్

అయోధ్య సెట్‌తో వినాయక చవితి వేడుకలు

ఎంవీపీకాలనీ : అయోధ్యలోని రామాలయం తరహా సెట్‌తో ఈ ఏడాది వినాయక చవితి వేడుకలు నిర్వహించనున్నట్లు యూత్ ఐకాన్ సంస్థ వెల్లడించింది. ఎంవీపీ కాలనీ సెక్టార్– 12లోని గ్రౌండ్‌లో ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గతంలో సంస్థ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని నోవాటెల్ సమీపంలో చాక్లెట్ వినాయకుడిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది అయోధ్య తరహాలో సెట్ వేసి బాల వినాయకుడిని ప్రతిష్టిస్తామన్నారు.

మొహర్రం ప్రార్థనలు



మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మద్రిపాలెం: మొహర్రం సందర్భంగా బుధవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జీద్ ఈ అల్ ఖదర్ ఆధ్వర్యంలో మసీదు ప్రాంగణంలో ముస్లిం మత గురువు తక్రీర్ పటించారు. మసీదు కమిటీ ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రత్యేక పానీయాన్ని ముస్లింలకు అందజేశారు. త్యాగానికి ప్రతీకగా ప్రతి ఏడాది మొహర్రం ప్రార్థనలు నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు మున్నా తెలిపారు.

ఉత్తరాంధ్ర నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



విజయనగరం ఎంపీ అప్పలనాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

ఆరిలోవ: ఉత్తరాంధ్ర నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడిని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ కోరారు. ఆరిలోవ ప్రాంతం హెల్త్‌సిటీ ప్రాంతానికి బుధవారం ఎంపీ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను హేమంత్‌కుమారుతో పాటు కొందరు నిరుద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఉత్తరాంధ్ర నిరుద్యోగుల సమస్యలపై ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పొట్నూరు వెంకటకృష్ణారావు, సేనాపతి రమణ, పతివాడ పాపారావు తదితరులు ఉన్నారు.

లలితా పీఠంలో భగవద్గీత పారాయణ

సీతంపేట: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం ఉదయం లలితానగర్ శ్రీలలితా పీఠంలో సామూహిక భగవద్గీత పారాయణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భగవద్గీతను లయబద్ధంగా పారాయణ చేశారు. ముందుగా పీఠంలోని కల్యాణ వేంకటేశ్వరుడికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, అష్టోత్తరం చేశారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్రాఫిక్‌పై వాహన చోదకులకు అవగాహన

జగదాంబ: ట్రాఫిక్‌పై వాహన చోదకులు అవగాహన కలిగి ఉండాలని జోన్–3 ఏసీపీ రాజీవ్‌కుమార్ అన్నారు. సడన్ అండ్ సర్‌ప్రైజ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం టౌన్ కొత్తరోడ్డు వద్ద వాహన చోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే ట్రిబుల్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడిపే వారికి అపరాధ రుసుము విధిస్తామన్నారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే మూడు నెలల పాటు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, ఎస్ఐవిశ్వనాథ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



టౌన్ కొత్తరోడ్డు వద్ద వాహన చోదకులతో మాట్లాడుతున్న ఏసీపీ రాజీవ్‌కుమార్

జూపార్కులో సిద్ధమవుతున్న ఆర్వో ప్లాంట్లు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో సందర్శకులకు శుద్ధి చేసిన తాగునీరు అందించడానికి కొత్తగా మరో నాలుగు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే జూ పార్కులో నాలుగు ఆర్వో ప్లాంట్లు ఉండగా, ఇప్పుడు మరో నాలుగు సిద్ధం చేస్తున్నారు. దివీస్ కంపెనీ సీఎస్సార్ నిధులతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు జూ అధికారులు తెలిపారు. జిరాఫీ ఎన్‌క్లోజర్, జూలో టీ జంక్షన్, ఆఫ్రికన్ చిలకల జోన్, కోతుల జోన్ వద్ద వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్లాంట్ల నిర్మాణం పూర్తయింది. త్వరలోనే ఇవి జూలో సందర్శకులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆర్వో ప్లాంట్లు కూడా అందుబాటులోకి వస్తే జూలో మొత్తం ఎనిమిది చోట్ల ఆర్వో ప్లాంట్ల ద్వారా సందర్శకులకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులోకి వస్తుందని జూ అధికారులు తెలిపారు.



జూలో ఆఫ్రికన్ చిలకల జోన్‌లో నిర్మించిన ఆర్వో ప్లాంట్

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం పలువురు విరాళాలు అందజేశారు. ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మి, సూరిబాబు దంపతులు రూ.1.10 లక్షలను ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్‌కు, నగరంలోని మహారాణిపేటకు చెందిన వి.సూర్య ఉమాభారతి అనే దాత రూ.లక్ష విరాళ చెక్కును అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకు అందించారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



ఏఈవో నరసింగరావుకు చెక్కు అందజేస్తున్న దాత సూర్య ఉమాభారతి

19న సంగీత సంస్థ 32వ వార్షికోత్సవం

దాబాగార్డెన్స్: ఈనెల 19న సంగీత సంస్థ 32వ వార్షికోత్సవం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు భూషణ్ బ్రదర్స్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సంస్థ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 7 గంటల నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా 7 సార్లు మేజర్ పోర్టుల జాతీయ అవార్డులు పొందిన ప్రముఖ ఘంటసాల గాయకుడు ఫణిభూషణ్‌కు ప్రోత్సాహ కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో భూపతి నాటక కళా పరిషత్ ప్రతినిధులు వర్రె నాంచారయ్య, వెంకట్, కృష్ణంరాజు, ఫణిభూషణ్, ఎంవీఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఏయూ వీసీగా దళితుడికి అవకాశమివ్వాలి



మాట్లాడుతున్న పోరాట సమితి నాయకులు

సీతమ్మధార: ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ (వీసీ)గా దళిత వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశమివ్వాలని దళిత హక్కుల పోరాట సమితి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ డిమాండ్ చేసింది. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ ఏయూ వీసీ రాజీనామాను గవర్నర్ ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు కలిగిన ఎందరో ప్రతిభావంతులు, శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన ఘనత ఆంధ్ర యూనివర్సిటీకి ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ లాంటి గొప్ప వ్యక్తులను ఏయూ తయారు చేసిందని గుర్తు చేశారు. యూనివర్సిటీలో సెర్చ్ కమిటీ వేయాలన్నారు. 25 ఏళ్లుగా ఓసీ, బీసీలకు చెందిన వారే వీసీలుగా ఉన్నారని, ఈ సారి దళితులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్యదర్శి జి.రాంబాబు పాల్గొన్నారు.